ప్రతి డివిజన్‌లో సమస్యల పరిష్కారమే లక్ష్యం

9వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

పీర్జాదిగూడ, జూన్ 8: ప్రతి డివిజన్‌లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 9వ డివిజన్ మల్లికార్జున్‌నగర్,రాఘవేంద్రకాలనీలో స్థానిక కార్పొరేటర్, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో విద్యుత్, సీసీ రోడ్డు నిర్మాణ సమస్యలతో పాటు తాగునీటి కొరత లేకుండా సరిపడా నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బచ్చరాజు, నాయకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతిలో దివ్యాంగులకు విద్యాబోధన

దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌చారి

జవహర్‌నగర్, జూన్ 8: దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అధునాతన పద్ధతిలో విద్యాబోధన అందిస్తున్నామని, సకలాంగుల పిల్లలకు ధీటుగా దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని భవిత కేంద్ర ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌చారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో శనివారం బడిబాట కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌చారి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు పాఠశాలకు వెళ్తేనే మానసికంగా ఎదుగుతారని, ప్రభుత్వం దివ్యాంగుల కోసం సకల వసతులు కల్పిస్తుందని, బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం..

అల్వాల్ డివిజన్ బండబస్తీలో పాదయాత్రచేసి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 8: ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం బంబబస్తీలో కార్పొరేటర్ పాదయాత్రచేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగు నీటి సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులతో సర్వే చేయించి నిధులు మంజూరు కాగానే అభివృద్ధిపనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, అరుణ్‌కుమార్, భిక్షపతి, జయంతి, విజయలక్ష్మి, శోభ, లలిత, శ్రీలత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

కృష్ణానగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ జె. ప్రభుదాస్

మల్లాపూర్,జూన్ 8: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని కాలనీల్లో సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో కాలనీవాసులతో పర్యటించి తాగునీరు, డ్రైనేజీ సమస్యలను తెలుసుకున్నారు. మున్సిపల్, జలమండలి శాఖ అధికారుల సమన్వయంతో త్వరలోనే ఇట్టి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మల్కాజిగిరి, జూన్ 8: ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. శనివారం మచ్చ బొల్లారం యాదవ సంఘంలో సురేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, డాక్టర్ కల్యాణ్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కీసర, జూన్ 8: చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామి చారిటబుల్ ట్రస్టు ద్వారా భక్తులకు శనివారం ఉదయం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, ఎంపీపీ ఇందిరలక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న ఆలయ చైర్మన్

కొర్రమీను @ రూ.1200

- మృగశిర కార్తితో చేపలకు భలే గిరాకీ
- చెరువులు,మార్కెట్ల వద్ద జనం సందడి

శామీర్‌పేట/మేడ్చల్, జూన్ 6 : మృగశిర కార్తి సందర్భంగా శనివారం చేపలకు భలే గిరాకీ వచ్చింది. జనాలు చేపలు కోసం ఎగబడ్డారు. చేపల మార్కెట్‌లతో పాటు చెరువులు,కుంటలు జనంతో కిటకిటలాడాయి. మేడ్చల్ పట్టణానికి చెందిన పలువురు మేడ్చల్, శామీర్‌పేట మండలాలకు వెళ్లి, చేపలు కొనుగోలు చేశారు. శామీర్‌పేట, లక్ష్మాపూర్, బొమ్మరాశిపేట, ఉప్పర్‌పల్లి, ఉద్దెమర్రి, మల్కచెరువులు కొనుగోలుదారులతో పోటెత్తింది. డిమాండ్ దృష్ట్యా మత్స్యకారులు ఒక్కసారిగా చేపలు ధర పెంచారు. రౌ, బొచ్చెలు సాధారణంగా రూ.200 కిలో పలికితే శనివారం మాత్రం రూ.450 నుంచి రూ.500 పలికింది. సాధారణంగా కిలోకు రూ.500 నుంచి రూ.700 పలికే కొరమీను రూ.వెయ్యి నుంచి రూ.1200 పలికింది. గిరాకీ దృష్ట్యా మత్స్యకారులు, వ్యాపారులు మేడ్చల్‌లోని శివాజీ విగ్రహం, కిష్టాపూర్, కేఎల్‌ఆర్ తదితర చోట్ల చేపలను విక్రయించారు.

శామీర్‌పేట చెరువులో చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

రామోజీరావు మరణం తీరనిలోటు

రామోజీరావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్/మల్కాజిగిరి, జూన్ 8: రామోజీరావు మరణం తీరనిలోటని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత యాభై సంవత్సరాలుగా ఈనాడు దినపత్రికను స్థాపించి సమర్థవంతంగా నడిపిస్తున్నారని అన్నారు. ఈ టీవీతో పాటు రామోజీ ఫిలిం సిటీ నిర్మించి చరిత్రను సృష్టించారని అన్నారు. వారి ఆత్మకు శాంతిచేకురాలని, కుటుంబానికి, రామోజీ గ్రూప్ సంస్థల సిబ్బందికి తన ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు. అలాగే ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతిపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంతాపం తెలిపారు. ఈ మేరకు అనారోగ్యంతో మృతిచెందిన రామోజీ రావు పార్థివదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

కూకట్‌పల్లి జడ్సీ అభిలాష అభినవ్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ. చిత్రంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, జూన్ 8: ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. పెరుగుతున్న జనాభా నివాసాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు తగినన్ని నిధులను మంజూరు చేసి తోడ్పాటును అందించాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి (పార్ట్) డివిజన్‌లలో కొంతకాలంగా ఉన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూకట్‌పల్లి జడ్సీ, ఐఏఎస్ అధికారి అభిలాష అభినవ్‌తో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ కలిసి చర్చించారు. ఈ సందర్భంగా నిధులను మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, కమ్యూనిటీ హాళ్లు సహా ఇతర మౌలిక వసతుల కల్పనను మరింతగా పెంచాలని, పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై అధికారులతో తగు సమీక్ష నిర్వహించి జాప్యాన్ని నివారించేలా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వరద నీరు సాఫీగా వెళ్లిపోయేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, నాలాలు, మ్యాన్ హోళ్లలో వ్యర్థాల తొలగింపును పూర్తి చేయించాని ఎమ్మెల్యే గాంధీ కోరారు. నాలాలు, మ్యాన్‌హోళ్ల వద్ద ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలకు రహదారులు దెబ్బతినే అవకాశం ఉన్నందున తక్షణ మరమ్మతులను పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యల్లేకుండా చూడాలని ఎమ్మెల్యే గాంధీ జడ్సీ అభిలాషను కోరారు. కాగా, తన వినతి పట్ల జడ్సీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

రోడ్డుపైనే ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

మేడ్చల్, జూన్ 8 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో 3వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. వార్డు పరిధిలోని జయదర్శిని రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురికి నీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. పలు చోట్ల మురికి నీరు కారణంగా రోడ్డు ధ్వంసమై గుంతలు పడింది. దీంతో ఆ రోడ్డు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది పాటి వర్షానికే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగిపొర్లుతుందని స్థానికులు తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

ఉప్పల్, జూన్ 8: పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ను అధికధరలకు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దుచేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాగిల్లపురం కార్తీక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను లెక్కచేయకుండా విక్రయాలు చేపడుతున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్య లు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందించాలని కోరుతూ డీఈఓకు వినతి పత్రం అందజేశామన్నారు. అనుమతులు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మేడ్చల్, జూన్ 8: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని కేజీఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. దాదాపు 100 మంది కళాశాలలో 15 ఏండ్ల క్రితం చదివిన విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారునుద్దేశించి కళాశాల చైర్మన్ గోవింద రెడ్డి మాట్లాడుతూ 15 ఏండ్ల తర్వాత ఒకే వేదికపైకి పూర్వ విద్యార్థులు కలవడం సంతోషంగా ఉందన్నారు. కళాశాల చదువుతోనే స్నేహం ముగిసిపోవద్దని, కష్ట, సుఖాల్లో పాలుపంచుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పీవీ రమణారావు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు రవీందర్ రెడ్డి, నితిన్ రెడ్డి, రంగేశ్వర్ రెడ్డి, సునీత, వేణు, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

మూగబోయిన తెలంగాణ ఉద్యమ గొంతుక

జవహర్‌నగర్, జూన్ 8: తెలంగాణ ఉద్యమాన్ని తన గొంతుతో ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసిన ప్రజానాట్య మండలి కళాకారుడు రాజు మృతి తీరని లోటని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ గిరిప్రసాద్‌నగర్‌లో ప్రజానాట్య మండలి కళాకారుడు రాజు అనారోగ్య సమస్యలతో శనివారం మరణించాడు. విషయం తెలుసుకున్న సీపీఐ పార్టీ నాయకులు రాజు(52) పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలమల్లేష్‌యాదవ్ మాట్లాడుతూ సీపీఐ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన రాజు ప్రజా చైతన్యం కోసం పాటలతో ఊపిరినిచ్చేవాడు. గొప్ప కళాకారుడిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. సీపీఐ నాయకులు రాజు కుటుంబసభ్యులకు మనోధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్, దర్శనం యాదగిరి, మోతే రాజేశ్వరి, ఎల్లయ్య, లక్ష్మన్, సహదేవ్, శ్యామల, లత, సత్యం, కురుమయ్య, శ్రీను, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజు పార్థివదేహానికి నివాళులర్పించిన సీపీఐ నాయకులు

మాదకద్రవ్యాలు అమ్ముతున్న యువకుడు అరెస్టు

మల్కాజిగిరి, జూన్ 8: గుట్టుచప్పుడు కాకుండా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసిన సంఘటన మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం... లాలాపేట శాంతినగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ముబీన్(25), కొంత కాలంగా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు మెట్టుగూడ నుంచి మల్కాజిగిరికి వచ్చే దారిలో మిర్జాలగూడ మెయిన్ రోడ్డులో ముబీన్ మాదకద్రవ్యాలు విక్రయిస్తుండగా దాడిచేసి పట్టుకున్నారు. అతనిని నుంచి ఎల్ఎస్‌డీ బ్లాట్స్(25) స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

నేరేడ్‌మెట్, జూన్ 8: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సందీప్‌కుమార్ కథనం ప్రకారం.. వాజ్‌పెయ్‌నగర్‌లో చెన్నారెడ్డి (57) నివాసం ఉంటున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించామని పోలీసులు తెలిపారు.

భర్తతో విభేదం.. భార్య ఆత్మహత్య

జగద్గిరిగుట్ట, జూన్8: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. పోలీసుల వివరాల మేరకు జగద్గిరిగుట్ట మైపమ్మనగర్‌లో కమ్మరి భవాని(32) నివాసముంటున్నది. పదేండ్ల కిందట వివాహం కాగా, భర్త భానుచందర్‌తో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఉరివేసుకుంది. కుటుంబసభ్యులు గమనించేసరికే చనిపోయింది. ఈమేరకు బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అస్తమా నివారణకు ఉచితంగా మందు పంపిణీ

మేడ్చల్ రూరల్, జూన్ 8: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలోని సాయిగీత ఆశ్రమంలో అస్తమా వ్యాధి నివారణ ఆయుర్వేద ఔషధాన్ని పంపిణీ చేశారు. మృగశిర కార్తె సందర్భంగా శనివారం ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు సాయి కుమార్ బాబా ఆధ్వర్యంలో 480 మందికి ఆశ్రమ నిర్వాహకులు ఈ మందును ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ట్రెజరర్ యశోదమ్మ, సేవకులు పాల్గొన్నారు.

రోగులకు మందును పంపిణీ చేస్తున్న సేవకులు

ఏఎస్‌రావునగర్‌లో..

రామంతాపూర్‌లో..

రామోజీరావుకు ఘన నివాళి

రామంతాపూర్‌లో..

చర్లపల్లి, జూన్ 8 : ఈనాడు సంస్థ చైర్మన్ రామోజీరావు మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించిన ఏఎస్‌రావునగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్‌రెడ్డి, నాయకులు వంజరీ ప్రవీణ్, సురేందర్‌రావు, నాగేశ్వర్‌రెడ్డి, నర్సింహ, గోవర్ధన్, మోహన్ తదితరులు ఉన్నారు.

రామంతాపూర్: ఈనాడు సంస్థ అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా రామంతాపూర్ ప్రధాన రోడ్డులో శనివారం శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పలు పార్టీల నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చేతన హరీశ్,మాజీ కౌన్సిలర్ హనుమంతారావు, సాయికిరణ్,ఎల్లాచారి,ప్రవీణ్,శ్రీనివాస్,సోమ నువాస్,రమేశ్‌నాయక్, సురేశ్,రవి, పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బోడుప్పల్, జూన్8: ఆదివారం నిర్వహించే గ్రూప్-1 పరీక్షా కేంద్రాలకు చెంగిచర్ల డిపోనుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. 40 మంది విద్యార్థులు ఒకే కాలనీ నుంచి బయలుదేరనున్నట్లయితే అక్కడికే బస్సును పంపిస్తామని ఆమె తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్

చర్లపల్లి, జూన్ 8: చర్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సబ్‌స్టేషన్ ఏఈలు రవీందర్, పృథ్వీరాజు పేర్కొన్నారు. శనివారం సబ్‌స్టేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ 11 కెవీ గెయిల్ ఫీడర్, 11కేవీ ఐఓసీఎల్ ఫీడర్, 11కేవీ శెట్టి ఫీడర్, 11కేవీ సన్‌రైజ్ ఫీడర్, 11కేవీ డైనాటెక్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా 11కేవీ డామిన్డ్ ఫీడర్ పరిధిలోని పారిశ్రామికవాడ ఫేజ్ 3, 11కేవీ దేవి హైటెక్ ఫీడర్, 11కేవీ విమతా లాబ్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ప్రజావాణి పునఃప్రారంభం

బోడుప్పల్, జూన్8: ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రతి సోమవారం బోడుప్పల్, పీర్జాదిగూడ కార్యాలయాల్లో ప్రజావాణి పునః ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ రామలింగం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజలు ప్రజావాణిని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

యమున (ఫైల్)

పీర్జాదిగూడ, జూన్ 8: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జనగాం జిల్లా పాలకుర్తి గ్రామంలో నివాసం ఉంటున్న ధర్మవరపు యమున తన ఇద్దరి కూతళ్లతో కలిసి మే 30న పీర్జాదిగూడ చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్ కాలనీలో ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. అయితే ఈనెల 5న ఇంట్లో వారికి చెప్పకుండా యమున ఇద్దరు పిల్లలతో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుడికి వెళ్లిన యువతి..

అనురాధ(ఫైల్)

జవహర్‌నగర్: గుడికి వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో నాగరాజు కథనం ప్రకారం... దమ్మాయిగూడలో జెట్టి లక్ష్మి తన నలుగురు పిల్లలతో కలిసి నివాసముంటుంది. పెద్దకుమార్తె అనురాధ ఇంట్లోనే కుట్టుపని నేర్చుకుంటుంది. రోజువారి పనుల నిమిత్తం తల్లి లక్ష్మి బయటకు వెళ్లింది. ఈనెల 7న అనురాధ(21) గుడికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో అనురాధ ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. కుటుంబసభ్యులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

PUBLIC NOTICE

It is hereby informed to the General Public that my client **ABBANA BOINA PRATAP**, S/o Sri Padma rao, R/o Hyderabad has agreed to purchase all that agricultural land admeasuring Ac.16-22 Guntas in survey nos.361/5/B, 361/6 and 361/8, situated at Thumkunta Village, Shamirpet Mandal, Medchal-Malkajgiri District and accordingly my client has entered into an agreement of sale and part sale consideration has been paid to the owner i.e. Mr. Edwin Anthony, S/o Gopal. Hence it is informed to all that my client being the agreement holder in respect to the above mentioned property, hence it is hereby cautioned to the general public not to enter into any agreements, agreement of sale or sale deed/s or any other documents with respect to the above mentioned property and anyone doing so will be responsible for all consequences and legal action follows as per law.

Yours truly,
Sd/- Srikanth, Advocate
10-148, Chintal,
Quthbullapur, Medchal Dist.
Cont No. 9492351345